


డిగ్రీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం డీన్, ప్రొఫెసర్ వెంకటసుందరానంద పుచ్చా విడుదల చేశారు. శనివారం పరీక్షల విభాగం చాంబర్లో జూలై, ఆగస్టు 2023 పరీక్షల ఫలితాలను వెబ్ సైట్‌లో పొందుపరిచారు. 2వ సెమిస్టర్లో 1,132 మందికి 262 మంది, 4వ సెమిస్టర్లో 2,717 మందికి 620 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు.



రేసు గుర్రాలు



- టీడీపీ తొలి జాబితా విడుదల
- ఆరు నియోజకవర్గాల అభ్యర్థుల ప్రకటన
- నందికొట్కూరు అభ్యర్థిపై వీడని ఉత్కంఠ

నంద్యాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):

అంతా అనుకున్నట్టుగానే టీడీపీ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల ఎంపిక జరిగింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకుగాను ఆరు నియోజకవర్గాల అభ్యర్థులు తొలి జాబితాలోనే చోటు దక్కించుకున్నారు. నంద్యాల అభ్యర్థిగా ఎన్ఎండీ ఫరూఖ్, ఆళ్లగడ్డకు భూమా అఖిలప్రియ, బనగానపల్లెకు బీసీ జనార్దన్‌రెడ్డి, శ్రీశైలం బుడ్డా రాజశేఖరరెడ్డి, పాణ్యం గౌరు చరిత, డోన్ కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డిని అభ్యర్థులుగా టీడీపీ అధిష్టానం ఖరారు చేసింది. వైసీపీ ఇప్పటి వరకు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏడు జాబితాలను విడుదల చేసినా నంద్యాల జిల్లాలో ఒక్క నందికొట్కూరు మినహా మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థులపై ఓ స్పష్టత ఇవ్వలేదు. కానీ టీడీపీ తొలి జాబితాలోనే జిల్లా అభ్యర్థులపై స్పష్టత ఇచ్చింది. అభ్యర్థుల ఎంపిక ప్రకటన జరగ్గానే ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

గందరగోళానికి తావు లేకుండా..

అభ్యర్థుల ఎంపికపై టీడీపీ ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా స్పష్టమైన ప్రణాళికతోనే ముందుకు సాగినట్లు కనిపిస్తోంది. ఓ వైపు వైసీపీ తమ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తున్నా టీడీపీ వైపు నుంచి ఎలాంటి ప్రకటన లేదు. దీంతో చాలా మంది అభ్యర్థుల ఎంపిక జాప్యంపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. ఫలానా నియోజకవర్గంలో ఫలానా ప్రత్యామ్నాయం చూస్తున్నారని, ఫలానా వారికి మొండి చేయి చూపుతున్నారన్న ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే మొదటి నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఎవరినైతే ఇన్‌చార్జులుగా నియమించారో దాదాపు వారినే అసెంబ్లీ అభ్యర్థులుగా ప్రకటించారు. ఒక్క డోన్ నియోజకవర్గంలోనే మొదట ఇన్‌చార్జిగా ఉన్న ధర్మవరం సుబ్బారెడ్డిని కాదని కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డిని అభ్యర్థిగా టీడీపీ అధిష్టానం ప్రకటించింది. ఇక నంద్యాల విషయానికొస్తే ఇన్‌చార్జిగా ఉన్న భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి ఆ పార్టీ సీనియర్ నేత, మైనారిటీ నాయకుడు ఎన్ఎండీ ఫరూఖ్‌ను కొద్ది నెలల కిందట ఇన్‌చార్జిగా నియమించింది. ఇపుడు ఆయననే అభ్యర్థిగా ప్రకటించడంతో మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చినట్లయింది.

● తేలని నందికొట్కూరు భవితవ్యం..

జిల్లాలోని ఏకైక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంపైన టీడీపీ అభ్యర్థుల వడపోత కార్యక్రమం ఇంకా సాగుతూనే ఉంది. ఇక్కడి నుంచి గిత్త జయసూర్య, బండి జయరాజు, కాకరవాడ వెంకటస్వామి టికెట్ ఆశిస్తున్నారు. వీరికి తోడు అనూహ్యంగా వైసీపీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ కూడా తెరమీదకు వచ్చారు. ఆయన పేరుతో టీడీపీ ఇటీవల సర్వే కూడా నిర్వహించింది. జయసూర్య, జయరాజు ఇద్దరు కూడా పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అనుచరులు కాగా, కాకరవాడ సొంతంగా ప్రయత్నాలు సాగిస్తున్నాడు. అయితే వీరిలో ఎవరికి టికెట్ వస్తుందనే దానిపై సందిగ్ధత నెలకొంది. దీనిపై మార్చి మొదటి వారంలో ఓ స్పష్టత వస్తుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

టీడీపీ శ్రేణుల సంబరాలు

అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశాయి. పాణ్యం అభ్యర్థిగా గౌరు చరితను ప్రకటించడంతో కర్నూలు నగరంలోని అమ్మ హాస్పిటల్ సర్కిల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. అలాగే ఆళ్లగడ్డ నియోజకవర్గం అభ్యర్థిగా భూమా అఖిలప్రియ పేరు ఖరారు కావడంతో టీడీపీ శ్రేణులు ఆమెను అభినందించారు. నంద్యాల, ఆళ్లగడ్డలో ఆమె అనుచరులు, అభిమానులు కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ డోన్ నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పేరును అధిష్టానం ప్రకటించడంతో శనివారం కోట్ల, కేఈ వర్గాలు సంబరాలు జరుపుకున్నాయి. డోన్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. నంద్యాల పట్టణంలో టీడీపీ అభిమానులు బాణసంచా పేల్చారు. ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. బనగానపల్లెలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. బీసీ జనార్ధన్ రెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నాయకులు సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా కర్నూలు టీడీపీ అభ్యర్థిగా టీజీ భరత్‌ను ప్రకటించడంతో మౌర్యఇన్ వద్ద ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ, జనసేన పార్టీ నేతలు టీజీ భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబులను టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రుద్రవరంలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు



నంద్యాలలో ఫరూక్, మల్లెల రాజశేఖర్‌ను పూలమాలలతో సత్కరిస్తున్న నాయకులు



నంద్యాలలో భూమా అఖిలప్రియకు పూలబొకే ఇస్తున్న నాయకులు



డోన్‌లో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి పూల బొకే ఇస్తున్న నాయకులు



ఆత్మకూరులో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు



కల్లూరులో టీడీపీ జెండాలతో టీడీపీ నాయకులు

---

1 నుంచి స్పర్శ దర్శనం నిలుపుదల



శ్రీశైలం, ఫిబ్రవరి 24: శ్రీశైలం దేవస్థానంలో స్వామివారి స్పర్శ దర్శనాలు, గర్భాలయ, సామూహిక అభిషేకాలు, అన్ని రకాల ఆర్జిత సేవలు మార్చి 1 నుంచి 11 వరకు నిలిపేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మార్చి 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రాన్ని సందర్శించే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులందరికీ స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నారు. భక్తులకు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనానికి అవకాశం కల్పిం చారు. బ్రహ్మోత్సవాల ప్రారంభమైన 1 నుంచి 5 వరకు ఇరుముడి శివభక్తులకు నిర్దిష్ట వేళలో స్వామి వారి ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 5వ తేదీ రాత్రి 7.30 నుంచి 11వ తేదీ రాత్రి వరకు భక్తులందరికీ స్వామి వారి అలంకరణ దర్శనం మాత్రమే ఉంటుందని తెలిపారు.

కార్డుదారులకు చక్కర, కంది పప్పు, గోధుమ పిండి

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 24: నంద్యాల జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం, సబ్సిడీ ధరలపై చక్కర, కంది పప్పు, గోధుమపిండి ప్రతి నెలా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జేసీ సూచనల మేరకు మార్చి నెల బియ్యానికి బదులుగా 3 కిలోలు జొన్నలు ఉచితంగా, రాగిపిండి ఒక్కో కార్డుకు కిలో రూ.11 ప్రకారం పంపిణీ చేస్తామని అన్నారు. ఒకవేళ ఇంటి వద్ద నిత్యావసర వస్తువులు తీసుకోకపోతే ప్రతి నెలా 17వ తేదీన మధ్యాహ్నం నుండి ఎండీయూ వాహనాన్ని సచివాలయం వద్ద ఉంచి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు.

పట్టాలు లేకున్నా కట్టడాలు

- ప్రభుత్వ భూమిలో ఇష్టా రాజ్యం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- కొలిమిగుండ్లలో భూ బకాసురులు



కొలిమిగుండ్లలో కబ్జా చేసి బేస్ మట్టం నిర్మించుకుంటున్న దృశ్యం

బనగానపల్లె /కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 23 బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల పట్టణ సమీపంలోని ప్రభుత్వ భూములకు పట్టాలు లేకపోయినా వైపీపీ నాయకుల అండతో కొందరు అక్రమ కట్టడాలు చేపట్టారు. ఈ ప్రదేశం తహసీల్దారు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్నది. అయినా రెవెన్యూ అధికారులు చూస్తూ కూడా ఆక్రమణదారులను నిలువరించలేక పోతున్నారు. దీని వెనుక అధికార పార్టీ అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొలిమిగుండ్ల, ఇటిక్యాల, కల్వటాల గ్రామాలకు చెందిన పలువురు ప్రభుత్వ భూమిని కబ్జాచేసి గతవారం నుంచి ఇండ్ల బేస్ మట్టాల నిర్మాణం చేపట్టారు. బంజరు భూములను ఆక్రమించుకొని కట్టడాలు నిర్మిస్తున్నా రెవెన్యూ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. అత్యంత విలువైన స్థలాన్ని వైసీపీ నాయకుల అండదండలతో కబ్జా చేస్తున్నారు. కొందరు బంజరు భూములను ఆక్రమించుకొని ప్లాట్లుగా వేసి తెగనమ్ముకుంటున్నారు. పట్టాలు లేకున్నా ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణలు చేపట్టినా కొలిమిగుండ్ల మండల రెవిన్యూ అధకారులు వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నారు.

కొలిమిగుండ్లలోఅక్రమ కట్టడాలు: కొలిమిగుండ్ల పట్టణానికి అనుకొని బనగానపల్లె ఇటిక్యాల గ్రామాల మధ్య అక్రమ కట్టడాలు గత వారం రోజుల నుంచి మొదలుపెట్టారు. రాత్రింబవళ్లు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు పెట్టి నేల చదునుచేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ తంతంగం నడుస్తోంది. అసలు పట్టాలు ఇవ్వని స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకున్నా ప్లాట్లు వేసుకొని కట్టడాలు చేపట్టినప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. అధికారులు ఆ ఛాయలకు కూడా రావడం లేదు. ఇప్పటికైనా కలెక్టరు, ఆర్డీవో జోక్యం చేసుకొని అక్రమ కట్టడాలను నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.



అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పునాదులు

భూకబ్జాలను అరికట్టండి: దావీదు, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి : కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల రెవిన్యూ సర్వేనంబరు 738, 112/1లో అధికారపార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా భూకబ్జాలు చేస్తున్నారు. కొలిమిగుండ్ల క్రాసింగ్, ప్రధాన రహదారికి దగ్గరగా, రెవిన్యూ కార్యాలయం పక్కనే ఉన్నా రెవిన్యూ అధికారులు కబ్జాదారులను ప్రోత్సహించడం దారుణం,

ప్లాట్లు అమ్ముకుంటున్నారు

ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్లాట్లు వేసి తెగనమ్ముకుంటున్నారు. కొందరు ఇండ్లు కట్టుకుంటున్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే సందేహం కలుగుతోంది. అధికారపార్టీ నాయకుల అండ ఉంటే ఏమైనా చేయగలం అని కొందరు నిరూపిస్తున్నారు.

- సీపీఐ మండల నాయకుడు సూర్యనారాయణ

అటవీశాఖ దోపిడీని ఆపాలి

- లేకుంటే చలో ఆత్మకూరుకు పిలుపునిస్తాం
- హిందూ ధార్మిక సంఘాలు



ఆత్మకూరులో ర్యాలీ చేస్తున్న శివస్వాములు

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తుల నుంచి అటవీశాఖ పర్యావరణ రుసుము పేరిట రూ.10 వసూలు చేయడం ఆపాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివస్వాములు, హిందూ ధార్మిక సంఘాల నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్‌లోని ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం నుంచి గౌడ్‌సెంటర్, కేజీరోడ్డు, తహసీల్దార్ కార్యాలయం మీదుగా అటవీశాఖ డివిజన్ కార్యాలయం వద్దకు వారు ర్యాలీగా తరలివెళ్లారు. అక్కడ బైఠాయించి శివ భజనలు చేసి అటవీశాఖ రుసుం పేరుతో దోపిడీ చేయడం ఆపేయాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు గరుడాద్రి సుదర్శన్, నాయకులు శ్రీధర్‌గుప్తా, ఆవుల రెడ్డి, హిందూ ధర్మ రక్షణ కమిటీ నాయకులు శివరామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం అటవీ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు.

డోన్: కోట్ల నియోజకవర్గం



పేరు: కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి
తల్లిదండ్రులు: కోట్ల శ్యామలాదేవి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి (దివంగత మాజీ ముఖ్యమంత్రి)
పుట్టిన తేదీ: సెప్టెంబరు 18, 1951
విద్యాభ్యాసం: బీఏ, ఇంగ్లీష్ లిటరేచర్
కుటుంబం : కోట్ల సుజాతమ్మ (భార్య, మాజీ ఎమ్మెల్యే)
కూతుళ్లు : నివేదిత, చిత్ర
కుమారుడు : కోట్ల రాఘవేంద్రరెడ్డి
పదవులు: 1991, 2004, 2009లలో కర్నూలు ఎంపీగా పని చేశారు. 2012లో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రిగా పని చేశారు.
ఇష్టమైన ఆట: టెన్నిస్

రాజకీయ నేపథ్యం: కోట్ల కుటుంబం రెండు సార్లు సీఎం పదవులను అలంకరించింది. దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికయ్యారు. 1982 నుంచి 1983 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి పని చేశారు. ఆ తర్వాత 1992 అక్టోబరు నుంచి 1994 వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా పని చేశారు. పలుమార్లు కేంద్ర మంత్రిగా కూడా ఆయన పని చేశారు. ఆయన తనయుడు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కర్నూలు ఎంపీగా మూడుసార్లు ఎన్నికయ్యారు. మొదటిసారిగా 1992లో కర్నూలు పార్లమెంటుకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2004లో, 2009లో కర్నూలు ఎంపీగా ఎన్నికయ్యారు. 2012 సంవత్సరంలో కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రిగా కోట్ల పని చేశారు. 2019 ఎన్నికలో కర్నూలు పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.

ఎట్టకేలకు టీడీపీ అధిష్టానం నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో ఐదు స్థానాలు మినహా మిగతా అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. దీంతో ఇప్పటి వరకు సాగిన ఉత్కంఠకు తెరపడింది. అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశాయి. అయితే పెండింగ్‌లో ఉన్న స్థానాలపై టెన్షన్ నెలకొంది. ఒక్కో స్థానం నుంచి ఇద్దరు ముగ్గురు పేర్లు వినిపిస్తుండడంతో ఎవరికి సీటు ఖరారు చేస్తారన్నదానిపై చర్చ నడుస్తోంది. అనేక సమీకరణలను పరిగణలోకి తీసుకొని త్వరలో రెండో జాబితా ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

-కర్నూలు/నంద్యాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి)



శ్రీశైలం నియోజకవర్గం



పేరు: బుడ్డా రాజశేఖరరెడ్డి
కుటుంబం: బుడ్డా వెంగళరెడ్డి, (మాజీ మంత్రి), ఓబులమ్మ తల్లిదండ్రులు. కూతురు మేఘన
ఎన్నిసార్లు పోటీ : మూడు సార్లు (2009, 2014, 2019)
పదవులు: 2014లో ఎమ్మెల్యేగా గెలుపు
ఎడ్యుకేషన్ : బీఏ, ఎల్ఎల్‌బీ

టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తొలి జాబితాలో తన పేరును ప్రకటించడంపై బుడ్డా రాజశేఖరరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం సీటును తనకు కేటాయించిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తోపాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి అప్పగించిన బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో శ్రీశైల నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

కర్నూలు నియోజకవర్గం



పేరు: టీజీ భరత్
విద్యార్హత: ఎంఏ (యూకే)
కుటుంబ నేపథ్యం: అమ్మానాన్నలు టీజీ భరత్ (మాజీ ఎంపీ), రాజ్యలక్ష్మి, భార్య టీజీ శిల్పా, సంతానం కుమారుడు టీజీ విభు, కూతురు శ్రీఆర్య

రాజకీయ నేపథ్యం: కర్నూలులో టీజీ కుటుంబం పారిశ్రామిక రంగంలోనే కాదు.. రాజకీయ రంగంలోనూ రాణిస్తున్నారు. టీజీ గ్రూప్ ఆఫ్ కంపెనీల అధినేత టీజీ వెంకటేశ్ 1999లో తొలిసారిగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజ్యసభ ఎంపీగా పని చేశారు. ఆయన వారసుడిగా టీజీ భరత్ రాజకీయ అరంగేట్రం చేసి గత ఎన్నికల్లో తొలిసారిగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

కోడుమూరు నియోజకవర్గం



పేరు: బొగ్గుల దస్తగిరి
విద్యార్హత: ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం
కుటుంబ నేపథ్యం: అమ్మా నాన్నలు రాముడు (లేట్), బొగ్గుల శీలమ్మ సర్పంచ్, భార్య సుధారాణి, సంతానం గౌతమ్ శివరామ్, కార్తీక్ శివరామ్

● రాజకీయ నేపథ్యం : కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన ఈయన జేజినాన్న బొగ్గుల వనుమన్న, తండ్రి రాముడు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తల్లి శీలమ్మ సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు.

నంద్యాల నియోజకవర్గం



పేరు: నశ్యం మహమ్మద్ ఫరూక్
జననం: 1950 జనవరి 15, నంద్యాల
పిల్లలు : ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె
విద్యార్హత: పీయూసీ
పదవులు: రాష్ట్ర విభజన అనంతరం ఏపీ శాసన మండలి చైర్మన్, ఉమ్మడి ఏపీ డిప్యూటీ స్పీకర్, మాజీ మంత్రి, మూడు సార్లు ఎమ్మెల్యే

నేపథ్యం: టీడీపీ ఆవిర్భావంతో ఎన్టీఆర్‌తో కలిసి నడిచారు. పార్టీ పుట్టిన దగ్గర నుంచి ఇప్పటి వరకు పార్టీ మరకుండా, టీడీపీ వీర విధేయుడిగా ఉన్నారు. ఎన్టీఆర్ రెండో దఫా 1984 ప్రభుత్వంలో చక్కెర, వక్ఫ్‌బోర్డు శాఖ మంత్రిగా పని చేశారు. అనంతరం 1989లో ఓడిపోయారు. మళ్లీ 1994, 99లో రెండు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ సమయంలోనే ఉమ్మడి ఏపీకి డిప్యూటీ స్పీకర్, ఉన్నత విద్య, పురపాలక శాఖ మంత్రిగా పని చేశారు. 2019లో నంద్యాల ఎమ్మెల్యేగా గెలిచిన భూమా నాగిరెడ్డి 2017 అకాల మరణంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఫరూక్ పని తనాన్ని గుర్తించిన చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టడమే కాకుండా, ఆరోగ్య విద్య మంత్రిని కూడా చేశారు. ఇక ఇదే ప్రభుత్వ సమయంలో 2018 నుంచి సంవత్సరం పాటు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్‌గా పని చేశారు.

పత్తికొండ నియోజకవర్గం



పేరు: కేఈ శ్యాంబాబు
విద్యార్హత: ఎంబీఏ
కుటుంబ నేపథ్యం : అమ్మానాన్నలు కేఈ కృష్ణమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం, పద్మమ్మ, భార్య సునీత, సంతానం సుదీక్ష, జయని, జయతి

రాజకీయ నేపథ్యం: కేఈ కుటుంబం ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం. శ్యాంబాబు జేజినాయన దివంగత కేఈ మాదన్న 1963లోనే జిల్లా సమితి అధ్యక్షుడిగా పని చేశారు. 1967తో కర్నూలు ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. తండ్రి మాదన్న రాజకీయ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన కేఈ కృష్ణమూర్తి 1978లో తొలిసారిగా డోన్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. నాటి నుంచి ఆరు 2014 ఎన్నికల వరకు డోన్, పత్తికొండ నుంచి ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా గెలిచారు. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గంలో కేబినెట్ మంత్రి, డిప్యూటీ సీఎంగా పని చేశారు. తండ్రి వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన కేఈ శ్యాంబాబు 2019లో తొలిసారిగా పత్తికొండ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.

పాణ్యం నియోజకవర్గం



పేరు: గౌరు చరిత
విద్యార్హత డిగ్రీ : (పొలిటికల్ సైన్సు)
కుటుంబ నేపథ్యం: భర్త గౌరు వెంకటరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు, కొడుకు గౌరు జనార్దన్‌రెడ్డి, కూతురు చిద్విలా రెడ్డి

రాజకీయ నేపథ్యం : రాజకీయ, వ్యాపారం కుటుంబం నుంచి వచ్చారు. గౌరు చరిత మామ గౌరు జనార్దన్‌రెడ్డి, తాత గౌరు ఈశ్వరరెడ్డి నందికొట్కూరు నియోజకవర్గంలో రాజకీయంగా కీలకంగా పని చేశారు. 2004లో నందికొట్కూరు నుంచి, 2014లో పాణ్యం నుంచి రెండు పర్యాయాలు చరితమ్మ ఎమ్మెల్యేగా గెలిచారు. గత ఎన్నికల ముందు టీడీపీలో చేరి ఆ పార్టీ టికెట్‌పై పోటీ చేసి ఓడిపోయారు. ఈమె భర్త గౌరు వెంకటరెడ్డి సీనియర్ రాజకీయ నాయకుడు. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పోటీ చేశారు.

బనగానపల్లె నియోజకవర్గం

పేరు: బీసీ జనార్దన్‌రెడ్డి
పదవులు : మాజీ ఎమ్మెల్యే (2014), నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి.
జననం : 1959 జూలై 5
పుట్టిన స్థలం: యనకండ్ల గ్రామం, బనగానపల్లె మండలం
తల్లిదండ్రుల పేర్లు: బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మీదేవి
భార్య: బీసీ ఇందిరమ్మ
పిల్లలు: బీసీ మనోహర్ రెడ్డి, మనోరమ, శ్రీలక్ష్మి
విద్యార్హత: బీఏ



కాంట్రాక్టర్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించే బీసీ జనార్ధన్‌రెడ్డి మొదట రియల్ ఎస్టేట్, కాంట్రాక్టరు. ఇవి చేస్తూనే ప్రజాసేవ మీద మక్కువతో ఆయన సోదరుడు బీసీ రాజారెడ్డితో కలసి తండ్రి గుర్రెడ్డి పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. రాజకీయాల్లో చేరితే ప్రజలకు మరింత చేరువ అవ్వచ్చన్న ఉద్దేశంతో 2011లో టీడీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇవ్వడంతో ఇక్కడ నుంచి పోటీచేశారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డిపైన 17,341 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. పోటీ చేసిన మొదటిసారే బలమైన ప్రత్యర్థిని ఓడించడంతో జనార్దన్‌రెడ్డి పేరు జిల్లాలో మారుమోగింది. అయితే ఆ తర్వాతి ఎన్నికల్లో ఫ్యాన్ గాలి బలంగా వీచడంతో అదే వైసీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఓడిపోయినా టీడీపీలోనే కొనసాగుతూ ప్రజలతో మమేకమవుతూ జిల్లాలో బలమైన నేతగా ఎదిగారు. జిల్లాలో టీడీపీ గెలిచే మొదటి సీటు బనగానపల్లె అనేంతస్థాయిలో చరిష్మాను సంపాదించారు. ప్రస్తుతం టీడీపీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో చోట దక్కించుకున్న బీసీ జనార్దన్‌రెడ్డి విజయం ఖాయమైపోయిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

ఆళ్లగడ్డ నియోజకవర్గం



పేరు: భూమా అఖిలప్రియ
జననం: 2-4-1987
స్థలం : ఆళ్లగడ్డ
విద్యార్హతలు : బీబీఎం (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు, లండన్)
పదవులు: మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి
భర్త: భార్గవ్‌రామ్‌నాయుడు

నేపథ్యం: భూమా అఖిలప్రియది రాజకీయం కుటుంబం. ఆమె తల్లిదండ్రులు భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి ఇద్దరు కూడా ఎమ్మెల్యేలుగా పని చేశారు. నాగిరెడ్డి ఆళ్లగడ్డ, నంద్యాల ఎమ్మెల్యేగా పని చేయగా, శోభా నాగిరెడ్డి ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా పని చేశారు. 2014 ఎన్నికల్లో ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా శోభా నాగిరెడ్డి పోటీ చేశారు. అయితే దురదృష్టవశాత్తు ఈ ఎన్నికల ప్రచారానికి వెళ్లి వస్తున్న శోభా నాగిరెడ్డి ఆళ్లగడ్డ మండలం గూబగుండం మెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె చని పోయిన తరువాత కూడా జరిగిన పోలింగులో ప్రజలు ఆమెకు ఓట్లు వేసి గెలిపించారు. ఆ తరువాత ఆళ్లగడ్డ నుంచి ఆమె కుమార్తె భూమా అఖిలప్రియ వైసీపీ తరఫున బరిలోనికి దిగారు. అయితే అప్పటి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శోభా నాగిరెడ్డి మీద గౌరవంతో అఖిలప్రియకు పోటీగా తమ అభ్యర్థిని నిలబెట్టలేదు. దీంతో అఖిలప్రియ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక 2014 ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున గెలిచిన నాగిరెడ్డి తదనంతర పరిణామాలతో టీడీపీ చేరారు. అయితే 2017లో నాగిరెడ్డి కూడా ఆకస్మికంగా మరణించారు. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం అఖిలప్రియకు పర్యాటక శాఖ మంత్రి పదవిని కట్టబెట్టారు.

అత్త ఇంట్లో అల్లుడి దొంగతనం

- కేసును ఛేదించిన మూడో పట్టణ పోలీసులు
- రూ.4.80 లక్షల బంగారు నగలు స్వాధీనం

ఆదోని, ఫిబ్రవరి 24: అత్త బంగారు నగలు ఇవ్వలేదన్న కోపంతో అల్లుడు దొంగతనం చేశాడు. ఈ సంఘటన ఆదోనిలో జరిగింది. శనివారం పోలీసులు నిందితుడ్ని పట్టుకున్నారు. ఈనెల 22న రాఘవేంద్ర కాలనీలోని షాహిన్ అనే మహిళ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో 8 తులాల బంగారు నగలు, వెండి పట్టీలు గుర్తు తెలియని వ్యక్తి దొంగతనం చేశాడు. దీని గురించి బాధితురాలు ఫిర్యాదు చేసింది. మూడో పట్టణ సీఐ నరసింహరాజు మాట్లాడుతూ.. శనివారం రిలయన్స్ ట్రెండ్స్ సమీపంలో ఉస్మానాబాద్‌కు చెందిన సయ్యద్ ఇసాక్ తమను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. నిందితుడిని విచారించగా షాహిన్ చిన్న కూతురు షాహినా భర్తనని తెలిపాడు. అత్త తనకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఈనెల 22వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అత్త షాహిన్ ఇంటికి వెళ్లి తాళాలు పగలకొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి, డబ్బు దొంగతనం చేశానని ఒప్పుకున్నాడని అన్నారు. నిందితుడి నుండి 34.729 గ్రాముల లాంగ్ చైన్, 29.564 గ్రాముల షార్ట్ చైన్, 20.728 గ్రాముల బంగారు నెక్లెస్, 10 గ్రాముల బంగారు ఉంగరాలు, 20.480 గ్రాముల మూడు జతల బంగారు, 204 గ్రాముల వెండి పట్టీలు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.4.80 లక్షలు ఉండవచ్చని వివరించారు. నిందితుడ్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఐదు దుకాణాల్లో చోరీ

పత్తికొండ, ఫిబ్రవరి 24 : పత్తికొండ పట్టణంలో నిత్యం రద్దీగా ఉంటే స్టేట్‌బ్యాంక్ సర్కిల్, కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంతాలలో శుక్రవారం రాత్రి 5 దుకాణాలలో చోరీ జరిగింది. కన్యకాపరమేశ్వరి దేవాలయం ముందు రీడింగ్ రూం కాంప్లెక్స్‌లో ఉన్న ఐడీఎఫ్‌సీ సర్వీస్ పాయింట్ తాళాలు పగలగొట్టిన దొంగలు క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ 60 వేలు చోరీచేశారు. అలాగే పాత వెంకటేశ్వర టాకీస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న భగవాన్ మొబైల్స్‌లో కస్టమర్లు రిపేరీ కోసం ఇచ్చిన నాలుగు సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లారు. స్టేట్‌బ్యాంక్ ముందున్న బీడీ బంక్‌లో రూ1,500 నగదుతోపాటు రూ 5వేల విలువగల సిగరెట్ ప్యాకెట్‌లను తీసుకెళ్లారు. శ్రీరామ్ సెలూన్‌లో చీటీ కట్టేందుకు దాచిపెట్టుకున్న రూ 10,000 నగదుతోపాటు పక్కనే ఉన్న చాముండేశ్వరి కిరాణ జనరల్‌స్టోర్ కౌంటర్‌ఉన్న రూ 4వేల నగదును ఎత్తుకెళ్లారు. ఒకేరోజు 5 దుకాణాలలో దొంగతనం జరగడంతో దుకాణదారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎస్ఐ గోపాల్ చోరీజరిగిన దుకాణాలను పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరు గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ గోపాల్ తెలిపారు.

అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: అక్రమంగా క్వారీలో రోడ్డు మెటల్‌ను తవ్వినా, క్రషర్ చేసినా కఠిన చర్యలు తప్పని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం సి. బెళగల్ మండలంలోని పలుకుదొడ్డి, గుండ్రేవుల గ్రామాల్లో సర్వే నెంబర్లు 457, 240 గ్రామాల్లో అక్రమంగా రోడ్డు మెటల్ క్యారింగ్, అక్రమ క్రషర్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేశామని తెలిపారు. క్రషర్ యూనిట్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించామని, సంబంధిత వ్యకులు ఏ. రాంభూపాల్, ఏ. ప్రభాకర్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు మురహరి, దిలీప్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి మోసం చేసిన బీజేపీ

చాగలమర్రి, ఫిబ్రవరి 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి మోసం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. శనివారం చాగలమర్రి పీఎస్ డాబా వద్ద జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా దగా చేసిందని అన్నారు. కడప జిల్లాలోని స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికిందని, ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖపట్నం ఉక్కును ప్రైవేటుపరం చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో ఉనికి లేని బీజేపీ కోసం టీడీపీ, వైసీపీ, జనసేనలు పాకులాడటం సిగ్గుచేటని అన్నారు. ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలుగా మారాయని ధ్వజమెత్తారు. అటువంటి బానిస పార్టీలతో రాష్ట్రానికి ఏం మేలు జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు ముడి పడి ఉందని, ప్రత్యేక హోదా, అభివృద్ధికి ప్యాకేజీ నిధులు కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్, వామపక్షాల పొత్తు రాష్ట్రానికి అవసరం అన్నారు. ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలు పోరాటం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహబూబ్‌బాషా, అన్నమయ్య జిల్లా పుంగనూరు కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి, కడప జిల్లా నాయకులు అమర్, ఉత్తన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ మీడియా చైర్మన్ ఎన్.తులసీరెడ్డి

మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ హరినాథ్

శ్రీశైలం, ఫిబ్రవరి 24: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్. హరినాథ్ కుటుంబ సమేతంగా వచ్చి దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద జస్టిస్ ఎన్. హరినాథ్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి

మంత్రాలయం, ఫిబ్రవరి 24: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రియదర్శిని, ఏపీ రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్ వెంకట రమణ శనివారం రాత్రి వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. వీరు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు స్వామివారి మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఎస్ఐ గోపినాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ చాంపియన్ పశ్చిమ గోదావరి

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 24: 52వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు స్వర్ణంతో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అలాగే కర్నూలు జట్టు రజిత పతకాలు, నంద్యాలకు కాంస్య పతకాలు దక్కాయి. శనివారం డా.కె. రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, టోర్నమెంటు ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ కలిసి ట్రోఫీ, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు, నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.మహబూబ్ బాషా, కోశాధికారి రాజ్‌కుమార్ రెడ్డి, ఆయా జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు లక్ష్మణ్, జాన్ దత్తరావు, సురేష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అరెస్టు

శ్రీశైలం, ఫిబ్రవరి 24: శ్రీశైలం దేవస్థానం పరిధిలో రాత్రి వేళలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆటో డ్రైవర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. పగడాల శివ అనే యువకుడు ఘంటామఠం ప్రాంతంలో నివశిస్తూ దేవస్థానం పరిధిలోని ఇళ్లలో రాత్రి వేళలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. ఆన్‌లైన్ గేమ్స్, మద్యం, జూదం వంటి వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాడుపడ్డారన్నారు. ఇటీవల దేవస్థానం ఉద్యోగి ఇంట్లో జరిగిన దొంగతనం కేసు విచారణలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడ్ని గుర్తించినట్లు వెల్లడించారు. అతడి నుంచి మూడున్నర తులాల బంగారం, రూ. 1.35 లక్షలను రికవరీ చేసుకున్నామని, ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'మందకృష్ణ మాదిగతోనే ఎస్సీ వర్గీకరణ'

కొత్తపల్లి, ఫిబ్రవరి 24: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని నందికొట్కూరు యువసేన అధ్యక్షులు నరసింహ మాదిగ, రాజు మాదిగ అన్నారు. శనివారం కొత్తపల్లిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంపంగి మద్దిలేటి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నరసింహ మాదిగ మాట్లాడుతూ మాదిగల ఉప కులాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ చివరిదశలో ఉందన్నారు. మాదిగ ఉప కులాల ప్రజలు త్వరలోనే వర్గీకరణ సాధించుకునేందుకు అవకాశం వచ్చిందన్నారు. 28న మందకృష్ణ మాదిగ కర్నూలు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటన విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాన్ శ్రీను, ఓబులేసు, నారాయణ, రమేష్, సురేష్ మాదిగలు ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ కోసమే టీకాలు

పాణ్యం, ఫిబ్రవరి 24 : అటవీ సమీపంలోని వన్యప్రాణుల సంరక్షణ కోసం సమీప గ్రామాల్లోని పశువులకు టీకాలు వేస్తున్నట్లు అటవీ రేంజ్ అధికారి సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఆలమూరులో అటవీశాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు వ్యాక్సినేషన్ వేశారు. సర్పంచ్ షరీఫ్, డీఆర్వో చంద్రహాస్, ఏడీ కమలాకర్, డాక్టర్ సులోచన, ఎఫ్‌బీఓ జమాల్‌వలి, మహేష్, అబ్దుల్‌కలాం పాల్గొన్నారు.

మున్సిపల్ వేలాల్లో పెరిగిన ఆదాయం

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగం కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన వేలాల్లో స్వల్ప ఆదాయం సమకూరింది. ఇందులో వారాంతపు సంత వేలాలను ఎన్ఎస్. జిలానీ రూ.4.14లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ వేలాలను బీజాన్‌బీ రూ.4.13 లక్షలు, బస్టాండ్ ఫీజులను అమానుల్లా రూ.5.33లక్షలు, చిన్నకబేళా ఖలీల్‌అహ్మద్ రూ.1,67లక్షలు, పెద్దకబేళా ఆంజనేయులు రూ.39100, చేపలు, చికెన్ అమ్మకాల వసూళ్లకు అల్లిషేర్ రూ.1.12 లక్షలకు దక్కించుకున్నారు. వేలం పాటలు దక్కించుకున్న వారు అదనంగా 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన మొత్తం వేలాల ద్వారా ఆత్మకూరు మున్సిపాలిటీ మొత్తం రూ.16,78,100 ఆదాయం మున్సిపాలిటీకి సమకూరింది. కాగా 2023-24 సంబంధించి 16,65,500 రాగా ఈ ఏడాది రూ.12600 స్వల్పంగా ఆదాయం పెరిగింది. ఈవేలం పాటలకు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ హాజరయ్యారు.

రాష్ట్ర పునర్నిర్మాణ సభను జయప్రదం చేయండి : కాంగ్రెస్

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: అనంతపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 26న జరిగే రాష్ట్ర పునర్ నిర్మాణ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇబ్రహీం పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఎన్నికల హామీలను సీఎం జగన్ పూర్తిగా విస్మరించారని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర విభజన అంశాల జోలికే వెళ్లకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాన్ని పునర్ నిర్మించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు.అనంతపురంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర పునర్ నిర్మాణ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు రహిమాన్, జైలాన్‌బాషా, శివ శంకర్ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య



శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యానికి ఫీజు చెల్లిస్తున్న భరత్ శర్మ దంపతులు

నందికొట్కూరు ఫిబ్రవరి 24: పుట్టిన ఊరి రణం తీసుకోవడానికి గ్రామంలోని పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలో సొంత నిధులను విద్యను అందిస్తున్నట్లు మిడ్తూరు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ప్రముఖ ఆస్ట్రాలజీ పి.వి. భరత్ శర్మ తెలిపారు. హైదరాబాదులో సినీ, రాజకీయ, వ్యాపారవేత్తలకు ఆస్ట్రాలజీ చెబుతూ పేరు సంపాదించారు. గ్రామంలోని 45 మంది పేద విద్యార్థులకు సుమారు రూ. 20లక్షలను నందికొట్కూరు పట్టణంలోని శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలలో తన సొంత నిధులతో శనివారం ఫీజు చెల్లించారు.

నిందితులను అరెస్టు చేయాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: వరకట్న వేధింపులతో హత్యకు గురై ఆత్మహత్యగా చిత్రీకరించబడిన శిరీషాబాయి మృతికి గల కారకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు జవహర్‌నాయక్, బుజ్జి, దరగయ్య, శీలం శేషు, మల్లయ్య, రామ్‌బాలాజీనాయక్, నరసింహానాయక్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట శిరీషాబాయి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగస్వామినాయక్, రమేష్‌నాయక్, వెంకటశివనాయక్, రామారావు, మంతన్న, పెద్దపుల్లన్న, మల్లికార్జుననాయక్ ఉన్నారు.

సోలార్ భూ సేకరణను ప్రభుత్వమే చేపట్టాలి

పాణ్యం, ఫిబ్రవరి 24 : సోలార్ పరిశ్రమ నిర్మాణానికి భూసేకరణను ప్రభుత్వమే చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కందికాయపల్లి గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆలమూరు, కందికాయపల్లి, బేతంచెర్ల మండలంలోని ముసలాయి చెరువు, గ్రామాలలో ఏఎం గ్రీన్ ఎనర్జి కంపెనీ సోలార్ ప్రాజెక్టుకు 2500 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 700 ఎకరాలు ఆలమూరు, కందికాయపల్లిలో రైతుల భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. ముసలాయిచెరువు పరిధిలో మరికొంత భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రైవేటు కంపెనీ రైతుల భూములను కొల్లగొడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రైవేటు కంపెనీల దోపిడీకి సహకరిస్తున్నారన్నారు. చట్టాన్ని అమలు చేయకుండా ఎకరాకు పట్టా భూములకు రూ. 12 లక్షలు, డీ పట్టాలకు ఎనిమిది లక్షలు నిర్ణయించి రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా గ్రామసభలు జరపకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకునష్టపరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు పర్చాలని డిమాండ్ చేశారు. సమానంగా నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

29న వీహెచ్‌పీఎస్ సమావేశం

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 24: నంద్యాలలోని నిశాంత్ భవన్‌లో ఈనెల 29వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి గంగాధర్‌శెట్టి శనివారం తెలిపారు. వికలాంగుల పింఛన్ రూ.3000 వేల నుంచి రూ.6000కు పెంచాలని, వికలాంగుల న్యాయమైన డిమాండ్లపై చర్చించేందుకు జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

టీడీపీ నాయకుల సంబరాలు

●అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ ● హర్షం వ్యక్తం చేసిన నాయకులు



నంద్యాలలో మల్లెల రాజశేఖర్, నాయకుల సంబరాలు



నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 24 : నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఎన్ఎండీ ఫరూక్‌ను పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శనివారం నంద్యాలలోని ఖలీల్ థియేటర్ ఆవరణలో ఉన్న టీడీపీ కార్యాలయంలో కోలాహలం మొదలైంది. కార్యకర్తలు, నాయకులు బాణసంచా కాల్చారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు భారీ ఎత్తున కార్యాలయానికి చేరుకొని ఎన్ఎండీ ఫరూక్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు, బీసీ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్దన పార్టీ కార్యాలయం చేరుకొని ఫరూక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకంతో అసెంబ్లీ సీటు కేటాయించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయాన్ని సాధించి చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని ధీమా వ్యక్తం చేశారు.

● ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి భూమా అఖిల ప్రియను టీడీపీ రాష్ట్ర అధిష్టానం ప్రకటించడంపై నంద్యాలలోని భూమా అఖిల ప్రియకు చెందిన టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శనివారం భూమా అఖిలప్రియ నంద్యాలలోని ఆమె నివాసానికి వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. బాణాసంచాను కాల్చారు. కేక్ కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసీరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకా శివశంకర్‌యాదవ్, మధుసాయి, ఒంటివెలగల భాస్కర్‌రెడ్డి, చాంద్‌బాష, మాజీ కౌన్సిలర్లు అజ్మీర్, కృపాకర్, పల్లె వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాణ్యం టిక్కెట్ గౌరు చరితకు రావడంతో...

నందికొట్కూరు: టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యేల అభ్యర్థుల జాబితాను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించారు. అందులో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌరు చరితారెడ్డిని బాబు ప్రకటించారు. దీంతో నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్‌లో బాణసంచా పేల్చుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌరు చరితారెడ్డిని చంద్రబాబు ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అందుకు కృతజ్ఞతలు తెలిపారు. పాణ్యంతో పాటు నందిక్కొట్కూరు, నంద్యాల లోక్‌సభ సీటు కూడా 2024 ఎన్నికల్లో టీడీపీని గెలిపించి అధినేతకు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నందికొట్కూరు క్లస్టర్ ఇన్‌చార్జి ముర్తుజావలి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి షకీల్ అహ్మద్, నిమ్మకాయల రాజు, రాజన్న, కళాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో టీడీపీ శ్రేణుల సంబరాలు

ఆత్మకూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేరును అధిష్టానం ప్రకటించడంతో ఆత్మకూరు పట్టణంలో శనివారం టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ప్రత్యేకించి పట్టణంలోని గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్ సెంటర్లలో టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బుడ్డా రాజశేఖరరెడ్డిని ఇరుపార్టీల అధినేతలు ప్రకటించడాన్ని తామందరం స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇదేస్ఫూర్తితో శ్రీశైల నియోజకవర్గంలో తమనేత బుడ్డా రాజశేఖరరెడ్డి నాయకత్వంలో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా తాము చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అడ్వకేట్ వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, సుబ్బయ్య, రామ్మూర్తి, రాజారెడ్డి, గౌస్, మున్నా, న్యామత్, నబిరసూల్, షఫివుల్లా, రమేష్‌గౌడ్, రవీంద్ర బాబు, వెంకటరావు, సతీష్ తదితరులు ఉన్నారు.

మహానంది: టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అధిష్ఠానం టికెట్ కేటాయించడంతో మహానంది మండలంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. మహానంది టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి గని చిన్న రంగస్వామి, సురే శ్రీనివాసులు, రామచంద్రుడు మాట్లాడుతూ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేస్తామని అన్నారు.

పాణ్యం : పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత గెలుపే తమ లక్ష్యమని జిల్లా టీడీపీ ముస్లిం మైనార్టీ కార్యవర్గ సభ్యులు ఖాదర్‌బాషా తెలిపారు. శనివారం పాణ్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపి అధిష్ఠానం శనివారం పాణ్యం టీడీపీ అసెంబ్లీ సీటు గౌరు చరితకు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గౌరు చరిత గెలుపుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, కృష్ణ, సుబ్బయ్య, రవి, గోల్డ్ సుబ్బయ్య, మదారు, మమబూబ్ బాషా, శేఖర్ పాల్గొన్నారు.



ఆత్మకూరులో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ శ్రేణులు



మహానందిలో...



నందికొట్కూరులో బాణసంచా కాలుస్తున్న కార్యకర్తలు

వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరికలు

వెలుగోడు,ఫిబ్రవరి 24: వెలుగోడు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. శనివారం బోయ రేవుల గ్రామ సర్పంచ్ పెద్దస్వామన్నతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు సుమారు 500 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అనంతరం మాజీఎమ్మెల్యే బుడ్డా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైల నియోజక వర్గంలో తెదెపా జెండాను ఎగుర వేసి చంద్రబాబుకు కానుక ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు, వెలుగోడు మాజీ సర్పంచ్‌లు గోవిందరెడ్డి, అబ్దుల్ కలాం, టీడీపీ నాయకులు శేషి రెడ్డి, ఖలీల్ ,జాకీర్, స్వామన్న, సూర్యనారాయణ రెడ్డి, రాజశేఖర్, ఎల్లాస్వామి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శనివారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో వైసీపీలోకి చేరారు. వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామంలో గల మాజీ ఎమ్మెల్యే బుడ్డా స్వగృహంలో వారు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి టీడీపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారిలో గ్రామానికి చెందిన షేక్ సుబాన్, పింజరి మౌలాలి, కురువ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఈడిగ నగేష్, మంగలి శేషులతో పాటు 50కుటుంబాల వారు ఉన్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు నాగార్జున ఉన్నారు.



టీడీపీలో చేరిన బోయరేవుల గ్రామ వైసీపీ నాయకులు

ఈవీఎంల ర్యాండమైజేషన్ డ్రై రన్: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 24 : రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ నుండి ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్‌పై సంపూర్ణ అవగాహన పొందాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈవీఎంల ర్యాండమైజేషన్ డ్రై రన్ నిర్వహించారు. జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు. కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్ల వారిగా కేటాయించే ఈవీఎంల ర్యాండమైజేషన్ డ్రై రన్‌పై పూర్తి స్థాయి శిక్షణ పొందాలన్నారు. పార్లమెంటు నియోజకవర్గానికి, అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధిచి వరుసగా 2030 కంట్రోల్ యూనిట్లు, 1924 కంట్రోల్ యూనిట్లు, 2509 బ్యాలెట్ యూనిట్లు, 2520 బ్యాలెట్ యూనిట్లు, 2452 వివి ప్యాట్లు, 2451 వివి ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తి చేసుకొని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా వున్న ఈవీఎంలను జిల్లా ఎన్నికల అధికారి లాగ్ఇన్‌లో తొలి దఫా ర్యాండమైజేషన్ జరుగుతుందన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి స్థాయిలో రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి అనంతరం పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తారని తెలిపారు. సమావేశంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు చికిత్స పొందుతూ మృతి

వెలుగోడు,ఫిబ్రవరి 24: వెలుగోడు పట్టణంలోని పదో వార్డులో జనవరి 29న కుక్కల దాడిలో అష్రఫ్‌అలీ (5) తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడ్ని కర్నూలుకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. అయితే అష్రఫ్ అలీ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. ఎస్డీపీఐ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెలుగోడులో కుక్కల స్వైరవిహారంపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

బీజేపీ మోసం చేసింది

నందికొట్కూరు ఫిబ్రవరి 24: గత 9 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ చేయకుండా కేంద్రం ఇప్పుడు మాదిగల ఓటు బ్యాంకు కోసం కమిటీలను వేసి కాలయాపన చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉరుసుపాటి బ్రహ్మయ్య అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొత్తబస్టాండు నుంచి కిసాన్ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిసాన్ పార్కులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నంద్యాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ ప్రభుత్వం గత 9 సంవత్సరాలుగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా మాదిగలను మోసం చేస్తోందన్నారు. నందికొట్కూరులో మాదిగలకు టిక్కెట్ ఇవ్వకుంటే ప్రతిఘటిస్తామని ఆయన అధికార, ప్రతిపక్ష పార్టీలను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు శ్రీరాములు, మాజీ సర్పంచ్‌లు మరణ, సుధాకర్, నాగరాజు, ఎస్సీఎస్సీ లాయర్స్ ఫోరం నాయకుడు కాటెపోగు భాస్కర్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు బేబీ రాధ, తదితర నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 24: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం తిరుపూరికి చెందిన నల్లనాగ వెంకటేష్ దంపతులు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు ఎ. నాగరాజుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 24 : నంద్యాల పట్టణంలో శనివారం బీజేపీ ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో పట్టణంలోని ఫరూక్‌నగర్, మొయిన్ బజార్, పెద్దబండ, జంబుల పరమేశ్వరి ఆలయ తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ దౌర్జన్యాలు పెరిగిపోయాయని, వచ్చే ఎన్నికల్లో ఓటు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొశెట్టి చంద్రశేఖర్, మహిళ నేతలు స్వాతి, ఉపేంద్ర, బాలన్న పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు..

● ఇంటింటికి బ్రహ్మన్న కార్యక్రమం కొనసాగుతుంది

- మాజీ ఎమ్మెల్యే భూమా



నంద్యాలలోని భూమా బ్రహ్మానందరెడ్డి నివాసం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 24: నంద్యాల టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డికి అధిష్ఠానం కేటాయించకపోవడంపై నంద్యాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు పెద్దఎత్తున భూమా బ్రహ్మానందరెడ్డికి ఇంటికి చేరుకున్నారు. కార్యకర్తలకు భూమా బ్రహ్మానందరెడ్డి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అధిష్టానం తీసుకున్న నిర్ణయం వల్ల ఎవరూ అసంతృప్తి చెందాల్సిన పని లేదని, అధైర్యపడాల్సిన అవసరం అంతకన్నా లేదని, ఎప్పటిలాగే నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నుంచి ఇంటింటికి బ్రహ్మన్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, ఆ కార్యక్రమం నంద్యాల నియోజకవర్గంలో నిర్విరామంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

దూదేకులను మోసం చేసిన వైసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 24: దూదేకులను అన్ని రకాలుగా సీఎం జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి దూదేకుల ఖాజావలి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో దూదేకుల ఫెడరేషన్‌కు ప్రతి ఏటా రూ.40 కోట్ల కేటాయిస్తానని చెప్పి ఇంత వరకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 20 లక్షలకు పైగా ఉన్న దూదేకులను బీసీ ఈలో చేర్చే విధంగా కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పి, నేటి వరకు ఆదిశగా చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి నాయకత్వంలో వైసీపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో దూదేకుల ముర్తుజావలి, మా బాషా, చాంద్ బాషా పాల్గొన్నారు.

జంబులా పరమేశ్వరికి బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: ఆత్మకూరు పట్టణ శివార్లలోని జంబులాపరమేశ్వరి ఆమ్మవారి ఆలయంలో శనివారం బోనాల సమర్పణ మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రతిఏటా మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని లోకకళ్యాణార్థం అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. మహిళలు నైవేద్యాలతో కూడిన బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసిన అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి గ్రామ శివారులో వెలసిన జంబులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బార్తాల పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం వేడుకలను పురస్కరించుకుని దివంగత పల్ల పడగలయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అనంతరం వడి బియ్యం, బోనాలు సమర్పించారు.

పాములపాడు: పాములపాడులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం చేడేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొలను భారతిలో భక్తుల సందడి

కొత్తపల్లి, ఫిబ్రవరి 24: కొత్తపల్లి మండలంలోని నల్లమలలో కొలువైన కొలనుభారతి పుణ్యక్షేత్రంలోని అమ్మవారి సన్నిధిలో భక్తజన సందడి నెలకొంది. శనివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరావడంతో క్షేత్రం కలకలలాడింది. ఈవో మోహన్ ఆదేశాల మేరకు అమ్మవారికి ప్రత్యేక నూతన వస్త్రాలంకరణ, విశేష అలంకరణ, పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన, కుంకుమార్చన తదితర విశేష పూజలు జరిగాయి. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షర బీజాక్షర క్రతువులు చేయించుకున్నారు.

లక్ష బిల్వార్చన

పాములపాడు, ఫిబ్రవరి 24 : మహాశివునికి లక్ష బిల్వార్చన, అభిషేకాలను శివస్వాములు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలోని శివాలయంలో గురుస్వామి రామక్రిష్ణ ఆధ్వర్యంలో శివస్వాములు మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని లక్ష బిల్వార్చన, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాయత్రి మాత ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 24: నల్లకాలువ గ్రామంలో వెలసిన శ్రీగాయత్రి అమ్మవారి ఆలయంలో 19వ వార్షిక మహోత్సవ వేడుకలను శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు శేషఫణి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం గాయత్రి మాత అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా సామూహిక హోమ పూజా క్రతువులు శాస్త్రోక్తంగా చేపట్టారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

'వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి'



భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మల్లేవేముల గ్రామంలో వైసీపీ నాయకులు ఈదుల శంకర్‌రెడ్డి, నందీ వాహనరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఈదుల శేఖర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, ఓబయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డిలతో పాటు 25 కుటుంబాలు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్ష్యంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ ఆళ్లగడ్డ నాయకులు భార్గవ్‌రామ్‌నాయుడు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు ఈదుల ప్రతాప్‌రెడ్డి, రామనరసింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పుట్టా పెద్దమ్మ జాతర

బేతంచెర్ల, ఫిబ్రవరి 24: పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ నుంచి బోయపేట మీదుగా పుట్టా పెద్దమ్మకు బోనాల జాతర వైభవంగా శనివారం నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బీఎస్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకుడు తలారి రామకృష్ణ ఈ బోనాల జాతర నిర్వహించారు. బోయపేట హనుమాన్ నగర్, సంజీవనగర్ మీదుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

రుద్రవరం, ఫిబ్రవరి 24 : నంద్యాల పట్టణానికి చెందిన అశ్వత్‌కుమార్‌చౌదరి, శోభరాణి దంపతులు రుద్రవరం మండలం వాసాపురం వెంకటేశ్వరుడికి రూ.1,11,116 ఆర్థిక సాయం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి నరసింహులుకు అందించారు.

వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల 24 ఫిబ్రవరి: ఆర్టీసీ బస్సు, మోటర్ బైక్ ఢీకొనడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కోవెలకుంట్ల మండల పరిధిలోని బీమునిపాడు కుందరవాగు బ్రిడ్జి మధ్య ఆర్ఎంపీ రహదారిలో శ నివారం చోటు చేసుకుంది. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రాముడు మోటర్ బైక్‌పై క్రిష్టిపాడు నుంచి కోవెలకుంట్ల వస్తుండ గా కోవెలకుంట్ల నుంచి ఆళ్ళగడ్డ వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు కుందర వాగు బ్రిడ్జి సమీపంలో వచ్చేసరికి బస్సు మోటర్ బైక్ ఢీకొనడంతో రాముడికి తీవ్రగా యాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు, ఎస్సై వరప్రసాద్ కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యర్థుల ఖరారుతో టీడీపీ శ్రేణుల్లో సంబరాలు

టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అభ్యర్థుల పేర్లను ప్రకటించడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. డోన్ అభ్యర్థిగా కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, ఆళ్లగడ్డకు అఖిలప్రియ, బనగానపల్లెకు బీసీ జనార్దన్‌రెడ్డి పేర్లను ఖరారు చేశారు.

డోన్, ఫిబ్రవరి 24: టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల పేరును ప్రకటించడంతో కర్నూలులోని కోట్ల నివాసం వద్ద సందడి నెలకొంది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, డోన్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, ప్యాపిలి మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, డోన్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, అంబాపురం సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలేబాదు పరమేష్, చంద్రపల్లి ఆచారి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, గోసానిపల్లి మాజీ సర్పంచ్ మల్లయ్య, వెంకటాపురం పెద్దయ్య, రాచర్ల రజినీ యాదవ్, మాధవరం స్వామి, కిరణ్ యాదవ్, ఓం ప్రకాష్, అలంకొండ రఫీ, విష్ణువర్దన్ రెడ్డి, ఘన మద్దయ్య, రవి, అజీజ్, కొచ్చెర్వు అశోక్, ఖాజా, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పరదేశి మహేష్, కోట్లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మాజీ జడ్పీటీసీ బుగ్గన ప్రసన్నలక్ష్మి అభినందనలు తెలిపారు.

ప్యాపిలి: టీడీపీ డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పేరును అధిష్టానం ప్రకటించడంతో శనివారం కోట్ల, కేఈ వర్గాలు సంబరాలు జరుపుకున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టి.శ్రీనివాసులు, వెంకటేశ్, గండికోట రమేష్, క్రిష్ణమోహన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: చంద్రబాబు ప్రకటించిన తొలి అభ్యర్థుల జాబితాలో డోన్ టీడీపీ అభ్యర్థిగా కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డిని ప్రకటించడం పట్ల టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, గూటుపల్లి ముల్లా, టీడీపీ సర్పంచులు శ్రీనివాస్ యాదవ్, నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్టేట్ బ్యాంకు సమీపంలో పాతబస్టాండులో బాణసంచా కాలుస్తూ మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. బుగ్గన మాధవి రెడ్డి, పుట్టపాశం వెంకటేశ్వర్లు, సుభాన్, సయ్యద్ అంజాద్, వలి, ఉరుకుందు, చంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ అభ్యర్థిగా భూమా అఖిలప్రియ పేరును అధిష్టానం ఖరారు చేయడంతో నాయకులు, కార్యకర్తలు శిరివెళ్లలో శనివారం బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ముస్లిం మైనార్టీ నాయకుడు బీసీ ఖాజా హుసేన్, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, బీసీ ఫిదా హుసేన్, బీఎండీ రఫి, అబూబకర్ సిద్ధిఖ్, యామా శ్రీకాంత్, అబ్దుల్ అజీస్, షఫివుల్లా, జీ సలాం, యూనుస్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రుద్రవరం: ఆళ్లగడ్డ టీడీపీ టికెట్‌ను భూమా అఖిలప్రియకు శనివారం కేటాయించారు. దీంతో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రుద్రవరం అమ్మవారిశాల సమీపంలో కేక్ కట్ చేసి టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఎల్వీ రంగనాయకులు, పోలా గురుమూర్తి, ఆలమూరు నారాయణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయ దుందుభి మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్, బాలరాజు, బీసీ సెల్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, శ్యాముల్, అల్లాడి చంద్రశేఖర్, కాంత్, ఐటీడీపీ ఇన్‌చార్జి గురప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా భూమా అఖిలప్రియను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని దొర్నిపాడు మండల సెక్రటరీ కొత్తపల్లి సురేంద్ర, చక్రవర్తి నాయుడు, మాజీ ఆలయ ధర్మకర్త లింగుట్ల వెంకట్‌నాయుడులు అన్నారు. శనివారం భాగ్యనగరం, దొర్నిపాడు, చాకరాజువేముల, కొత్తపల్లె, కొండాపురం గ్రామాల్లో బాణసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మల్లేశ్వరచౌదరి, సద్ది సత్యం, సిద్ధి నారాయణ, దయానందరావు, హర్షవర్ధన్, అమరసింహారెడ్డి, హబీబ్‌బాషా, డీలర్ రమణయ్య పాల్గొన్నారు.



శిరివెళ్లలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు



ప్యాపిలిలో..



బేతంచెర్లలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

సాగు నీటి సమస్య పరిష్కారానికి దీక్ష

నంద్యాల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు మంచి నీటి సమస్యను వేసవి రాకముందే ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి అఖిలప్రియ ఆరోపించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మీ కొట్టాలలో శనివారం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆ వార్డు టీడీపీ కౌన్సిలర్ హుసేన్‌బాషా నిర్వహించిన టీడీపీ నాయకులు అనంత రామసుబ్బారెడ్డి, చింతకుంట శేఖర్‌రెడ్డి, శూలం నరసింహులు, మహిళలు నూర్జహాన్, అట్ల శ్రీదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోంది

నంద్యాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ నంద్యాల పార్లమెంటరి అధ్యక్షులు లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బరగొడ్ల హుసేన్‌బాషా అధ్యక్షతన కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న అనంతపురంలో జరిగే రాష్ట్ర పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు చాంద్‌బాషా, నాగయ్య, నరసింహుడు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 24: మండలంలోని కాకరవాడ గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13,280 స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌ఐ క్రిష్ణారెడ్డి శనివారం తెలిపారు. తమకున్న సమాచారం మేరకు దాడులు చేయగా ఓంటిద్దుపల్లె, కడప జిల్లాలోని పెద్దముడియం, ఆర్.జంబులదిన్నె గ్రామాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నారని తెలుసుకుని దాడులు చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని రెహిమాన్‌పురంలో వెలసిన కాశీ విశాలాక్షి, విశ్వేశ్వర స్వామి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలుగా డోన్, నంద్యాల పట్టణానికి చెందిన చిక్కుడు బుల్స్ యజమాని మధు ఎద్దులకు ప్రథమ బహుమతి రూ.20వేలు, రెండో విజేతగా నందికొట్కూరు మండలం సాదుకొట్టం గ్రామానికి చెందిన రామ్‌గోపాల్ ఎద్దులకు రూ.15 వేలు, దండు రైడర్స్ నరసింహులు ఎద్దులకు మూడో బహుమతి రూ.10వేలు, పందికోన పీజే బుల్స్ ఎద్దులకు నాల్గవ బహుమతి రూ.8వేలు, రంగాపురం గ్రామానికి చెందిన బాల వినయ్ రావు ఎద్దులకు ఐదో బహుమతి రూ.6వేలు అందజేశారు.

మద్దిలేటి స్వామికి 1.149 కేజీల వెండి

బేతంచెర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లు భక్తుల ఇంటి ఇలవేల్పు కావడంతో 1.149 కేజీల వెండి వస్తువులను ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులుకు శనివారం అందజేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కి.శే. మద్దిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి చింతా కృష్ణవేణి 1.149 కేజీల విలువైన 4 వెండి వస్తువులను, అలాగే నంద్యాల జిల్లా ప్యాపిలి మండలానికి చెందిన ఎరుకలి పెద్ద మద్దయ్య 256 గ్రాముల వెండి వస్తువులను బహూకరించారని ఆలయ ఈవో రామాంజ నేయులు శనివారం తెలిపారు. అదేవిదంగా స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల ద్వారా రూ.4,91,057 ఆదాయం క్షేత్రానికి లభించినట్లు ఈవో తెలిపారు.

టీడీపీలో చేరిన భాస్కర్ నాయుడు

డోన్, ఫిబ్రవరి 24: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించడంతో అప్పుడే నియోజకవర్గ వైసీపీలో వలసలు మొ దలయ్యాయి. సీనియర్ న్యాయవాది, వైసీపీ నాయకుడు భాస్కర్ నాయుడు, శనివారం కర్నూలులో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

చౌడేశ్వరీమాత ఆలయ ఈవోగా కామేశ్వరి

బనగానపల్లె, ఫిబ్రవరి 24: నందవరం చౌడేశ్వరీమాత ఆలయ నూతన ఈవోగా కామేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో రామానుజన్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో దిన్నెదేవరపాడు గ్రూప్ టెంపుల్స్ ఈవోగా పనిచేస్తున్న కామేశ్వరిని బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయ ఈవోగా నియమించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చాగలమర్రి, ఫిబ్రవరి 24: మండలంలోని డి.కొత్తపల్లె ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య తెలిపారు. నీటి కోసం ప్రజల ఇక్కట్లు అన్న శీర్షిక శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఏఈ స్పందించి ఎస్సీ కాలనీలోని నీటి ట్యాంకును పరిశీలించారు. బోరులు నీరు తగ్గిపోవడంతో నీటి సరఫరా జరగడం లేదని, కొత్తగా విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసి నీటి సరఫరా కల్పిస్తామని అన్నారు. శెట్టివీడు గ్రామానికి మల్లేవేముల ఎస్ఎస్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని అన్నారు. ముత్యాలపాడు, తోడెండ్లపల్లె గ్రామాలకు కూడా ఎస్ఎస్ ట్యాంకు ద్వార నీటి సరఫరా కల్పిస్తామని అన్నారు. నీటి సమస్య ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంచామని అన్నారు.